www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 10 అక్టోబర్ 2023

5

కాకినాడ



# 12న జిల్లాలో సిఎం జగన్ పర్యటన

ప్రజాశక్తి-కాకినాడ

ఈ నెల 12న సిఎం వైఎస్.జగన్ కాకినాడ జిల్లా పెద్దాపురం నియోజవర్గం, సామర్లకోటలో పలు అభివద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉదయం 9 గంటలకు తాడేపల్లిలో హెలికాప్టర్‌లో బయలుదేరి 10 గంటలకు పెద్దాపురంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకుంటారు. అక్కడే పది నిమిషాలు పబ్లిక్‌తో ఇంటరాక్ట్ అయ్యి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటారు. అనంతరం సామర్లకోట మున్సిపాలిటీ పరిధిలోని జగనన్న హౌసింగ్ లేఔట్‌కు చేరుకుంటారు. అక్కడ ఫోటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తారు. అనంతరం పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొని ప్రసంగిస్తారు. కార్యక్రమం అనంతరం ఒంటిగంటకు హెలిక్యాప్టర్‌లో బయల్దేరి తాడేపల్లి వెళ్తారు.

# విద్యా శాఖ కాంట్రాక్టు సిబ్బంది కష్టాలు

- ఉద్యోగ భద్రత కోసం నిరీక్షణ
- 12 ఏళ్లుగా తప్పని చాకిరీ
- కనీస వేతనాలు కరువు
- 3 నెలలుగా అందని వేతనాలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

జిల్లాలో అన్ని మండల విద్యాశాఖాధికారి కార్యాలయాల పరిధి, కార్యాలయాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కరువయ్యింది. 2011 నుంచి విధులు నిర్వర్తిస్తున్నా సమాన పనికి సమాన వేతనాలు అందుకోలేకపోతున్నారు. అటు పనికి తగిన జీతాలు రాక ఇటు ఉద్యోగాలు క్రమబద్ధీకరణ కాక తమకు ఎదురు చూపులే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు మూడు నెలలుగా వేతనాలు అందక అప్పులు చేస్తున్నామని తెలిపారు. కుటుంబ పోషణ కోసం అనేక అవస్థలు ఎదుర్కొంటున్నామని, అధికారులు సమస్యలను పరిష్కరించడాని కృషి చేయాలని కోరుతున్నారు.

సర్వ శిక్షాభియాన్ ద్వారా కాంట్రాక్టు పద్ధతిలో 2011లో కలెక్టర్, జిల్లా ఎంపిక కమిటీ ద్వారా ఎపి స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్ 1996, రూల్ 22 ప్రకారం రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాతిపదికన రాత పరీక్ష ద్వారా ప్రతిభ ఆధారంగా కాంట్రాక్టు ఉద్యోగులను నియమించారు. సమగ్ర శిక్ష, విద్యా శాఖలో మండల లెవెల్, కాంప్లెక్స్, వివిధ పాఠశాలల్లో ఎంఐఎస్‌లు 65 మంది, సిఒలు 65 మంది, ఎంఎల్ఎ (మండల లెవెల్ అకౌంట్), సిఆర్‌పిలు 300 మంది, ఐఇఆర్‌టిలు 150 మంది, అసిస్టెంట్ ఎంఆర్‌సిలు 65, పార్ట్ టైం టీచర్స్ 800 మంది ఉండగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1,660 మంది పని చేస్తున్నారు. జగనన్న అమ్మఒడి, జగనన్న విద్యా కానుక, ఒఎస్‌సి చిల్డ్రన్, బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించడం, జగ్గనన్న గోరుముద్ద, నాడు-నేడు, పిల్లలపై విశ్లేషణ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. విద్యాశాఖలో అన్ని రకాల ముఖ్య సమాచారం నివేదికలను అందించడంలో వీరంతా ముఖ్య భూమికను పోషిస్తున్నారు. ఎంఇఒ కార్యాలయాల్లో పాఠశాల విద్యాశాఖకు సిబ్బంది లేనందున సంబంధిత శాఖ పరిపాలనా పరమైన విధులు, భాధ్యతలు నిర్వహిస్తున్నారు. మండల విద్యాశాఖాధికారికి సబార్డినేట్స్‌గా విద్యాభివద్ధికి సంబంధించి అన్ని రకాల భాధ్యతలు చేస్తున్నారు.



మండల విద్యాశాఖ కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బంది

**హామీ అమలు మరచిన జగన్**

వీరికి ఎటువంటి ఉద్యోగ భద్రత కానీ పిఆర్‌సిలో జీతాలు పెంచడం కానీ, ఎంటిఎస్ అమలు చేయడంలో గానీ ప్రభుత్వం చొరవ తీసుకోలేదు. నాడు ప్రజా సంకల్ప యాత్రలో 2018 జూన్ 4న కాంట్రాక్టు ఉద్యోగులు జగన్‌కు వినతిపత్రం అందజేశారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కాంట్రాక్టు ఉద్యోగులు వారి సర్వీస్ అర్హతలను బట్టి సాధ్యమైనంత ఎక్కువమందిని క్రమబద్ధీకరించి ప్రభుత్వ పరిధిలోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పైనే కావస్తున్నా నేటికీ సిఎం స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉద్యోగ భద్రత కల్పించి 23 శాతం జీతం పెంచేలా చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.



**పనో ఒత్తిడి పెరిగింది**

విద్యా శాఖకు సంబంధించిన అన్ని ప్రభుత్వ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో అమలయ్యేలా కృషి చేస్తున్నాం. ఎంఇఒ కార్యాలయంలో పరిపాలనాపరమైన బాధ్యతలు నిర్వహిస్తున్నాము. ఉపాధ్యాయుల ఇ-హాజరు పరిశీలన, బడి బయట పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించడం వంటి అనేక పనులు చేస్తున్నాం. కానీ వేతనాలు సరిపోవడం లేదు.

**- ఎస్.కొండరాజులు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్,పిఠాపురం.**



**3 నెలలుగా వేతనాలు లేవు**

12 ఏళ్లుగా డిగ్రీ, బిఇడి అర్హతతో పని చేస్తున్నాం. మా అర్హతలకు తగిన విధంగా కనీస జీతాలు అండడం లేదు. అవి కూడా మూడు నెలలుగా పెండింగ్‌లోనే ఉన్నాయి. అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నాం. ఇచ్చే అరకొర వేతనాలు సరిపోవడం లేదు.

**- డి.వెంకటేశ్వరరావు, సిఆర్‌పి, పిఠాపురం.**

# అర్జీలకు సంతృప్తికరమైన పరిష్కారం

ప్రజాశక్తి-కాకినాడ

జగనన్నకు చెబుదాం -స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలకు సంతప్తికరమైన పరిష్కారాలు అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ స్పందన సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో డిఆర్ఒ కె.శ్రీధర్ రెడ్డి, సివిల్ సప్లయ్ డిఎం డి.పుష్పమణి, కెఎస్ఇజెడ్ డిప్యూటీ కలెక్టర్ కె.మనోరమతో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులను సావధానంగా విని, అర్జీలను సత్వరం పరిష్కరించాల్సిందిగా ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి మొత్తం 504 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కతికాశుక్లా మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో అందిన ప్రతి వినతినీ క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

**సిఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్ష**

ముఖ్యమంత్రి వైఎస్.జగన్ సామర్లకోట పర్యటన ఈ నెల 12న ఖరారైన నేపథ్యంలో కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, డిఆర్ఒ కె.శ్రీధర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులతో సిఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్షించారు. సామర్లకోట ఇటిసి జగనన్న కాలనీలో గృహ నిర్మాణ పనులు, హెలిప్యాడ్, ఫైలాన్, పార్క్, బస్సు, ఆటోలు పార్కింగ్, రోడ్ షో, స్టాల్స్, ఫోటో ప్రదర్శన స్పందన వాలంటరీల ద్వారా అర్జీల స్వీకరణ, లబ్ధిదారుల తరలింపు వంటి అంశాలకు సంబంధించి ఇప్పటికే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్టు కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు.

# 16 నుంచి ఇవిఎంల పరిశీలన

ప్రజాశక్తి-కాకినాడ

ఈ నెల 16వ తేదీ నుంచి స్థానిక అంబేద్కర్ భవన్‌లో నిర్వహించనున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌ల మొదటి స్థాయి పరిశీలన ఏర్పాట్లును ఆర్‌డిఒ ఎన్‌వివి.సత్యనారాయణ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ నుంచి అంబేద్కర్ భవన్‌లో రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పరిశీలనకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లు ముమ్మరం చేయాలని, విద్యుత్, తాగునీరు, సిబ్బంది నియామకం, బారికేడింగ్, సాంకేతిక ఏర్పాట్లు తదితర వాటిని త్వరితగతిన చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ పర్యటనలో తహశీల్దారు పి.సీతాపతిరావు, ఆర్‌డిఒ కార్యాలయ పరిపాలన అధికారి వరహాలయ్య, సాంకేతిక మేనేజర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ సత్యనారాయణ

# రౌతులపూడిలో వైరల్ జ్వరాలు

ప్రజాశక్తి-రౌతులపూడి

మండలంలోని పలు గ్రామాల్లో వైరల్ జ్వరాలు ప్రజలను వణికిస్తున్నాయి. జ్వర బాధితులతో రౌతులపూడి ప్రభుత్వాసుపత్రి కిటకిట లాడుతోంది. ఆసుపత్రిలోని పలు వార్డుల్లో జ్వర బాధితులు వైద్య సేవలు పొందుతున్నారు. జ్వరంతో వస్తున్న రోగులను డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించడంతో ప్రభుత్వాసుపత్రిలో డెంగ్యూ పరీక్షలు చేయక ప్రైవేట్ ల్యాబ్‌ల వద్దకు వెళ్ళవలసి వస్తోంది. దీంతో రోగుల జేబులు ఖాళీ అవుతున్నాయి. సొమ్ములేక కొంతమంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టడంతో పాటు డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు చేసేలా చర్యలు తీసుకోవానలి ప్రజలు కోరుతున్నారు.



ఆసుపత్రి వద్ద క్యూ కట్టిన రోగులు

# దళిత రాష్ట్ర సదస్సు కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి-పిఠాపురం

దళిత సమస్యల పరిష్కారానికి ప్రత్యామ్నాయ విధానాలతో ఈ నెల 15న కాకినాడ సూర్య కళామందిరంలో జరిగే రాష్ట్ర దళిత సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ విరవాడ కాలనీలో సోమవారం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.సింహాచలం మాట్లాడుతూ భారతదేశ ప్రజాస్వామ్య పరిరక్షణకు మూలమైన భారత రాజ్యాంగాన్ని తూట్లు పొడిచేందుకు కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఈ 76 ఏళ్ళ స్వతంత్ర భారతదేశంలో నేటికీ దళితులపై దాడులు, అత్యాచారాలు, మానభంగాలు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మతోన్మాద ప్రధానమంత్రి మోదీ పల్లెత్తు మాట మాట్లాడకపోగా ద్రోహులకు రక్షణ కల్పించడం అత్యంత సిగ్గు చేటన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత సబ్ ప్లాన్ చట్టాన్ని రద్దు చేసి దళిత, గిరిజనులకు తీవ్ర అన్యాయాన్ని చేసిందన్నారు. దళితుల్లో చదువుకున్న నిరుద్యోగులు పెరుగుతున్నారు. కేంద్రంలో లక్షలాది బ్యాక్ లాగ్ పోస్టులు ఉన్న వాటిని భర్తీ చేయటం లేదని జగన్ ప్రభుత్వం 9/77 చట్టాన్ని మార్చి గవన్నర్‌తో ఆర్డినెన్స్ ఇప్పించి 20 ఏళ్ల దాటిన తర్వాత అసైన్డ్ భూములను అమ్ముకోవచ్చు అనే చట్ట సవరణ చేశారంటే ఇది దళితుల చేతుల నుండి భూమిని లాగివేయడమేఅన్నారు. 20 డిమాండ్లపై ఈ నెల 15న జరిగే సదస్సులో దళిత సంఘాల నాయకులు, అభ్యుదయ వాదులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మేడపాటి చంటిబాబు, డెక్కల లాజరు, టపా నాగేశ్వరావు, రాగం సత్తిరాజు, శివకోటి బాబి, లోవరాజు, కండెల్లి ఏసుబాబు, సతీష్ పాల్గొన్నారు.



కరపత్రాలు పంచుతున్న నేతలు

## పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం

ప్రజాశక్తి- పెద్దాపురం

నేపాల్‌లో జరిగిన 8వ అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ 93 కేజీల విభాగంలో పట్టణానికి చెందిన గొర్రెల సత్యనారాయణ బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా సత్యనారాయణను మన పెద్దాపురం ఫేస్‌బుక్ గ్రూపు సభ్యులు పెద్దిరెడ్డి నరేష్, నవీన్ నాని, సతీష్, భుజంగరావు, శివ తదితరులు అభినందించారు .

## జెనా మృతికి పలువురి సంతాపం

ప్రజాశక్తి- సామర్లకోట రూరల్

ఆల్ ఇండియా ఎఫ్‌సిఐ కార్మిక సంఘం వ్యవస్థాపకుడు జిఎస్.జెనా మృతికి పలువురు నాయకులు సంతాపం వెలిబుచ్చారు. సామర్లకోట యూనిట్ డిపిఎస్ వర్కర్స్ ఆధ్వర్యంలో సోమవారం సంతాప సభ నిర్వహించారు. వర్కర్స్ యూనియన్ సీనియర్ నాయకులు చల్లా కొండ, జామి రామకృష్ణ జెనా చిత్రపటానికి పూలమాలవేసి నివాళ లర్పించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌సిఐ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## స్పందన అర్జీల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - పెద్దాపురం


స్పందనలో సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించి అర్జీదారులకు తెలియజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్టు ఆర్‌డిఒ జె.సీతారామారావు తెలిపారు. సోమవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో నిర్వహించిన డివిజన్ స్థాయి స్పందనకు పట్టాదారు పాస్ పుస్తకం కోసం, ఆక్రమణల తొలగింపు కోసం, టిడ్కో కాలనీ సమస్యల పరిష్కారం కోసం, భూమి సర్వే కోసం ప్రజల నుంచి 8 అర్జీలు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఒ బాలామణి, మున్సిపల్ మేనేజర్ జ్యోతి రాణి, ఎడిఎ దైవ కుమార్, సిడిపిఒ జి.ఉష, డిటి భాను కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య సురక్షతో చేరువైన వైద్యం

**ప్రజలకు చేరువగా మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతోనే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిందని పలువురు అన్నారు. సోమవారం పలుచోట్ల వైద్య శిబిరాలు నిర్వహించి వైద్య సేవలందించారు.**

ప్రజాశక్తి-యంత్రాంగం

**కాకినాడ** నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగనరసింహారావు సాంబమూర్తి నగర్‌లో 8, 13 డివిజన్లకు సంబంధించిన శిబిరంలో పాల్గొన్నారు. వివిధ వైద్య పరీక్షలకు ఎంపికైన రోగులకు కమిషనర్ కిట్లు పంపిణీ చేశారు. శిబిరానికి వచ్చిన రోగులకు బిపి, చక్కెర వ్యాధి, కంటి వైద్యం తో పాటు వివిధ ఆరోగ్య సమస్యలకు సంబంధించి నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎంహెచ్ఒ డాక్టర్ పథ్వీచరణ్, టౌన్ ప్లానింగ్ సూపరింటెండెంట్ శాస్త్రి, చిట్నీడి మూర్తి, ఎండి అస్గర్, సత్య, పెంకే రవి, చిట్నీడి సత్తిరాజు, రాయుడు వాసు, గుత్తుల సత్యవతి పాల్గొన్నారు. **పెదపూడి** సర్పంచ్ సుందరపల్లి ప్రమీల ఆధ్వర్యాన నిర్వహించిన శిబిరంలో ఎంపిడిఒ పిజవిజయభాస్కర్, తహశీల్దార్ టి.సుభాష్ పాల్గొన్నారు. పౌష్టికాహార స్టాల్ ను వారు పరిశీలించారు. వైద్య నిపుణులు శ్యామల, ఫణితేజ, నిహారిక, హిమబిందు, రజిత, రాముడు, సూర్యతేజ గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎం.సత్య నారాయణరెడ్డి, ఎంపిటిసి సభ్యుడు సుందరపల్లి సుధాకర్, సచివాలయ కార్యదర్శులు గౌతమి చంద్ర, ఎం.చిన్ని, రాజుపాలెం ఉప సర్పంచ్ నాగమళ్ల వీరభద్రరావు, మాజీ సర్పంచ్ కట్టా రమణ, వైసిపి నేతలు పంపన నాగరాజు, దంగేటి దుర్గారావు పాల్గొన్నారు. **తాళ్లరేవు** సుంకరపాలెంలో తహశీల్దారు ఎస్.పోతురాజు, వైద్యులు ఎన్.శ్యామల, ఎల్.సురేష్ కుమార్, ఆర్.మాధురి, సత్తిబాబు, శ్రావణి తదితరులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సుమారు 300 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో సుంకరపాలెం సర్పంచ్ టిల్లపూడి నాగేశ్వరరావు, ఎంపిటిసి గుత్తుల శ్రీనివాస్, వైసిపి నాయకులు కాశి లక్ష్మణస్వామి, చేదూరి అరవింద్, ఇన్‌ఛార్జి కార్యదర్శి జ్యోతి సుధ పాల్గొన్నారు.



కాకినాడలో..



తాళ్లరేవులో..




పెదపూడిలో..

# అధికారుల అలసత్వంపై గొల్లపల్లి ఆగ్రహం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

సిఎం వైఎస్.జగన్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష నిర్వహణ పట్ల అధికారులు అలసత్వం వహిస్తున్నారని ఎంపిపి గొల్లపల్లి బుజ్జి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని లింగంపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఉదయం 11 గంటలు దాటుతున్నా ప్రజలెవ్వరు రాకపోవడానికి వాలంటీర్లు సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని ఆయన చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించాలనే సదుద్దేశంతో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన కలిగించడంలో వాలంటీర్లు, సిబ్బంది విఫలమయ్యారన్నారు.

**కార్టూ'నిజం'**




# చంద్రబాబు విడుదలయ్యే వరకూ పోరాటం

**వైసిపి ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసిన చంద్రబాబును విడుదల చేసే వరకూ పోరాటం ఆగదని పలువురు టిడిపి నాయకులు స్పష్టం చేశారు. సోమవారం పార్టీ ఆధ్వర్యాన దీక్షలు, నిరసనలు కొనసాగాయి.**

ప్రజాశక్తి-యంత్రాంగం

**కాకినాడ** సిటీ మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో బాలాజీ చెరువు సెంటర్‌లో చేపట్టిన దీక్షలు 27వ రోజుకు చేరాయి. ఈ దీక్షల్లో పలివెల రవి, అనంత కుమార్, అంబటి చిన్న, బంగారు సత్యనారాయణ, గదుల సాయిబాబా, నల్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు. అభివద్ధిని పూర్తిగా వదిలేసి రాష్ట్రంలోని వనరులను దోచుకు తింటున్న ముఖ్యమంత్రి జగన్ మరలా జైలుకు వెళ్లడం ఖాయమని కాకినాడ మాజీ మేయర్, టిడిపి మహిళా జిల్లా అధ్యక్షురాలు సుంకర పావని అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ పావని ఆధ్వర్యంలో నల్ల జెండాలు, బాబుతో నేను ప్లకార్డ్స్‌తో 33వ డివిజన్ కామేశ్వరి నగర్, కొల్లు వారి వీధి, ఏరుసువారి వీధిలో కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో పార్వతి, సత్య, గుజ్జు అనురాధ, ప్రసన్న, రిక్క లక్ష్మి, పెమ్మాడి సీత, టేకుమూడి అమల, రేలంగి వరలక్ష్మి, కనకం, దుర్గ, సత్యవతి, నిర్మల, రమణ, భ్రమరాంబ, కాసులమ్మ 33వ డివిజన్ నాయకులు పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** వలసపాకల సెంటర్‌లో రూరల్ మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంత లక్ష్మి సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్షలు 26వ రోజుకు చేరుకున్నాయి. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కటకంశెట్టి బాబీ, పిల్లి రాధాకృష్ణ, బోళ్ల కృష్ణమోహన్, దాయన రామ్‌ప్రసాద్, చంద్రు గోవిందరాజులు, గుండా శ్రీను, ముళ్లపూడి బాపిరాజు, కాకరపల్లి బుజ్జి, చౌదరి, చాత్రాతి సాయిబాబా, కంటే సత్తిబాబు పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక సుధాకాలనీలోని టిడిపి కార్యాలయం వద్ద నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో నిమ్మకాయల రంగనాగ్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, కొత్తెం వెంకట శ్రీనివాసరావు, రంధి సత్యనారాయణ, కాకినాడ రామారావు, తూతిక రాజు, ఎలిశెట్టి నాని, నూనె రామారావు, కొరుపూరి రాజు, చాగంటి గోపాలకృష్ణ, బొడ్డు ఉదయ్ పాల్గొన్నారు.



కాకినాడ రూరల్‌లో..



కాకినాడలో..

# 'మేరీ మిట్టీ- మేరా దేశ్'తో దేశభక్తి

ప్రజాశక్తి-కాకినాడ

విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించి, మన దేశ స్వాతంత్ర్య సమర యోధుల గొప్పదనాన్ని, వారి త్యాగాలను తెలుసుకోవడానికి మేరీ మిట్టీ- మేరా దేశ్ కార్యక్రమం దోహదం చేస్తుందని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అన్నారు. ఆజాదీకా అమత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మేరీ మిట్టీ- మేరా దేశ్ కార్యక్రమాన్ని సెప్టెంబరు 25వ తేదీ నుంచి 29వ తేదీ వరకు కాకినాడ జిల్లాలోని అన్ని పాఠశాలల్లో నిర్వహించి, 21 మండలాల నుండి మట్టిని సేకరించారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో 21 మండలాల నుంచి సేకరించిన మట్టిని కలశంలో నింపి ఆర్‌జెడి జి.నాగమణి ఆధ్వర్యాన కలెక్టర్ కృతికా శుక్లాకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని మండలాల నుంచి సేకరించిన పవిత్రమైన మట్టిని రాష్ట్ర స్థాయికి పంపిస్తామని, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి సేకరించిన మట్టిని కలశంలో నింపి రాష్ట్ర మంత్రి ఢిల్లీకి తీసుకెళతారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంవి.రామారెడ్డి, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.



కలశంను కలెక్టర్‌కు అందిస్తున్న ఆర్‌జెడి

## నేరాలు ఘోరాలు

### హోటల్‌పై విజిలెన్స్ దాడి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలోని మెయిన్ రోడ్డులోని శరవణ అయ్యప్ప విజిటేరియన్ మీల్స్ హోటల్‌పై విజిలెన్స్ శాఖ అధికారులు తనిఖీలు చేశారు. హోటల్లో గృహ వినియోగ గ్యాస్ సిలెండర్లను వినియోగిస్తున్నట్లు అందిన సమాచారంతో సోమవారం హోటల్‌ను తనిఖీ చేశారు. గృహ వినియోగ గ్యాస్ సిలెండర్లను వినియోగిస్తున్నట్లు గుర్తించినట్లు విజిలెన్స్ అధికారి కె.కుమార్ తెలిపారు. ఐదు గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నామని, హోటల్ నిర్వాహకుల జంగం లవకుమార్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎసిఐ జగనారెడ్డి, జయలక్ష్మీ, లక్ష్మీనారాయణ, హెచ్ జీవానందం, కానిస్టేబుల్ లోవకుమార్ పాల్గొన్నారు.

### కుక్కల దాడిలో వృద్ధునికి గాయాలు

ప్రజాశక్తి - గోకవరం

కుక్కల దాడిలో వృద్ధుడు గాయాల పాలైన సంఘటన సోమవారం గోకవరంలో చోటు చేసుకుంది. స్థానికులు కథనం ప్రకారం... మండల కేంద్రమైన గోకవరం గ్రామానికి చెందిన మహిపాల తాతీలు అనే వృద్ధుడు గోకవరం విద్యుత్ సబ్ స్టేషన్ వద్దకు కరెంట్ బిల్లు కట్టి తిరిగి వస్తుండగా మార్గ మధ్యలో ఆ వృద్ధుడుపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. స్థానికులు ఆ వృద్ధుడిని 108 వాహనంలో గోకవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

### కుమార్తెతో గొడవ : తండ్రి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

కన్న కూతురిపై అలిగిన తండ్రి విషం తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉండ్రాజవరం మండలం వడ్లూరులో చోటుచేసుకుంది. పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు మండలం చింతపల్లి గ్రామ నివాసి వేముల మంద కాశీ విశ్వనాథ రాజు (49), కుమార్తె దండు విద్యా కవిత మూడేళ్ల క్రితం వివాహం కావడంతో వడ్లూరులో భర్త దండు వెంకట బంగారు రాజుతో కాపురం ఉంటోంది. ఈమెకు ఒక కుమార్తె సంవత్సర కాలంగా కవితను పుట్టింటికి రమ్మని తండ్రి విశ్వనాథరాజు పిలిచినప్పటికీ ఆమె వెళ్లడం లేదు. ఈ కారణంగా తనతో మాట్లాడని కూతురుతో ఎలాగైనా కలవాలని ఆదివారం వడ్లూరు ఆమె ఇంటికి వచ్చాడు. ఆమె తండ్రికి సమాధానం చెప్పకపోవడంతోపాటు, పుట్టింటికి రానని తెలపడంతో తండ్రి మనస్తాపానికి గురయ్యాడు. తనతో తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలోకి చేరుకున్న అతడిని చుట్టుపక్కల వారు తణుకు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మరణించాడు. ఈ విషయమై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.రామారావు తెలిపారు.

### వేమగిరిలో దారి దోపిడీ

ప్రజాశక్తి - కడియం

ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకి వెళ్లి వస్తున్న ఇద్దరు వ్యక్తులను అటకాయించి దారి దోపిడీకి పాల్పడిన సంఘటన వేమగిరిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...కొత్తపేట మండలం వానపల్లి గ్రామానికి చెందిన నాగాబత్తుల దుర్గాప్రసాద్, గుత్తుల హేమసాయి తేజ విశాఖపట్నం ఉద్యోగానికి సంబంధించి ఇంటర్వ్యూ ముగించుకుని ఆదివారం తెల్లవారుజామున రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో దిగారు. రైల్వే స్టేషన్లో ఉన్న తమ వాహనంపై వానపల్లి గ్రామానికి వెళ్తుండగా వేమగిరి గట్టు సమీపానికి వచ్చేటప్పటికి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వారిని అటకాయించారు. కత్తులతో బెదిరించి వారి వద్ద ఉన్న రూ.4,500, పర్సు లాక్కుని ఎపి 05 సిఎస్ 1891 నెంబర్ గల యాక్సిస్ మోటారు సైకిల్‌పై పారిపోయారు. దీంతో బాధితులు సోమవారం కడియం పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన కడియం సిఐ పివిజి తిలక్ ఎస్ఐ బాలాజీ సుందరరావు, క్రైమ్ సిబ్బంది సురేష్, లక్ష్మణరావులతో కలిసి మోటార్ సైకిల్ ఆధారంగా సోమవారం ఉదయం వేమగిరి శివారు రత్నా ప్లాస్టిక్ కంపెనీ ప్రక్కన కాళీ స్థలంలో నేరానికి పాల్పడిన వేమగిరి గట్టుకు చెందిన బేరంపూడి మోహన్ స్వామి, విప్పర్తి ప్రశాంత్ కుమార్‌ను అరెస్టు చేశారు. వారి నుంచి బైకు, సెల్ ఫోన్ స్వాధీన పరుచుకున్నారు.

### పురుగు మందు తాగిన యువకుడు మృతి

ప్రజాశక్తి - పెరవలి

ముక్కామలకు చెందిన మట్టా పూర్ణ సాయి వినాయక(18) జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు పాల్పడిన సాయి వినాయక ఐటిఐ చదివాడు. ప్రస్తుతం ప్రయివేటుగా ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తున్నాడు. గత ఏడేళ్ల నుంచి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. మందులు వాడుతున్నా ఆ వ్యాధి నుంచి ఉపసమనం కలగడం లేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం ఖండవల్లి గ్రామ పొలంలో కలుపు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి బంధువులకు సమాచారం ఇవ్వడంతో అపస్మారక స్థితిలో ఉన్న ఆ యువకుడిని ఆసుపత్రికి తరలించారు. సోమవారం అతని ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎం. సూర్య భగవాన్ తెలిపారు.

### యువకుడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని వంగలపూడి గ్రామానికి చెందిన యువకుడు అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం...వంగలపూడి గ్రామానికి చెందిన గంప అప్పన్న(23) ఈ నెల 4న పురుషోత్తపట్నంలో కబడ్డీ క్రీడకు వెళ్లి వచ్చాడు. ఒంటి నొప్పులు ఎక్కువగా ఉన్నాయని కుటుంబ సభ్యులకు చెప్పాడు. మరుసటి రోజు మెడ పట్టిందని సీతానగరం సెలూన్ షాపుకు వెళ్లి అక్కడ స్పృహ తప్పి పడిపోయాడు. కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకుని వెళ్లి ఆర్ఎంపి వైద్యునితో ప్రాథమిక వైద్యం అందించే క్రమంలోనే ఆ యువకుడు కాళ్లు, చేతులు కొట్టుకోవడంతో కుటుంబీకులు హుటాహుటీన రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందాడు. మృతుడు అమ్మమ్మ లచ్చిరెడ్డి రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పోస్టుమార్టంకు మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

## సమస్యలు పరిష్కరించాలని టిడ్కో వాసుల ధర్నా

ప్రజాశక్తి - పెద్దాపురం




ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కాలనీ వాసులు

పెద్దాపురం-వాలుతిమ్మాపురం రహదారిలోని టిడ్కో కాలనీలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ జె.సీతారామారావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు మాట్లాడుతూ టిడ్కో కాలనీని మున్సిపాలిటీకి అప్పగించామని టిడ్కో అధికారులు చెబుతున్నారని, మున్సిపల్ అధికారులు మాత్రం తమకు కాలనీని అప్పగించలేదని అంటున్నారన్నారని చెప్పారు. ఈ కాలనీలో ఐదు మంచి నీటి బోర్లు ఉన్నప్పటికీ ఒకటి మాత్రమే పని చేస్తోందన్నారు. ఈ బోర్ల నుంచి వివిధ ప్రాంతాలకు మంచినీటిని సరఫరా చేసే ఆపరేటర్లను మున్సిపాలిటీ నియమించలేదన్నారు. దీంతో కాలనీ వాసులు మంచినీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అపార్ట్‌మెంట్లలో వాడకం నీరు ప్రవహించే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అక్కడక్కడ పూడుకుపోవడంతో మురుగునీరు ప్రవహించే దారి లేక అపార్ట్మెంట్ల వద్ద మురుగునీరు పేరుకు పోతోన్నారు. దీంతో అపార్ట్మెంట్లలోకి వెళ్లాలంటే మురుగు నీటిలో నుంచి నడుచుకుంటూ వెళ్ళవలసి వస్తోందన్నారు. ప్రజలు దుర్వాసనతో అవస్థలు పడుతున్నారన్నారు. ఈ కాలనీలో నివసించే ప్రజలు రేషన్ కోసం తాము గతంలో అద్దె ఇళ్లల్లో నివసించిన ప్రాంతాలకు వెళ్లి రేషన్ తెచ్చుకోవాల్సి వస్తోందని, వృద్ధులు పింఛను తీసుకోవడానికి కూడా ఎంతో దూరం వెళ్ళవలసి వస్తోందన్నారు. పింఛను, రేషన్ ప్రతి నెలా ఈ కాలనీకి వచ్చి అందజేసే ఏర్పాటు చేయాలన్నారు. ఈ కాలనీలో అక్కడక్కడా మాత్రమే వీధిలైట్లు వెలుగుతున్నాయన్నారు. కాలనీలో తుప్పలు, డొంకలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. చీకటి పడితే పాములు సంచరిస్తున్నాయని, దీంతో ప్రజలు రాత్రి సమయంలో కాలనీలో తిరగడానికి భయపడుతున్నారన్నారు. ప్రతిరోజూ మున్సిపాలిటీ నుండి ఈ కాలనీలో చెత్త సేకరణకు ట్రాక్టర్లు, సిబ్బంది రాకపోవడంతో కాలనీవాసులు ఎక్కడపడితే అక్కడ చెత్తను వేయవలసి వస్తోందన్నారు. ప్రతిరోజూ ఈ కాలనీ నుంచి చెత్త సేకరణకు సిబ్బందిని నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గడిగట్ల సత్తిబాబు, సిరపరపు శ్రీనివాస్, నెక్కల నరసింహమూర్తి, దారపురెడ్డి కృష్ణ, చల్లా విశ్వనాథం, కాలనీవాసులు బర్ల శ్రీను, తాతపూడి శ్రీనివాస్, చింతల బలరాం, కె.దుర్గాప్రసాద్, కందికొండ శ్రీదేవి, మండ పద్మావతి, గండి శివాని, ఉరిటి చంద్ర, కొమరి పార్వతి, నమ్మి నూకరత్నం, స్వాతి, లక్ష్మి, భవాని, రామ తులసి తదితరులు పాల్గొన్నారు.

## పంట కాలువపై ఆక్రమణ తొలగించాలని వినతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్ళరేవు పక్షుల పుంత (బాబా జీవన్ నగర్)ను ఆనుకుని ఉన్న పంట కాలువ బోధిని ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆక్రమించాడని ఆక్రమణలు తొలగించాలని సిపిఎం మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి తమ పంట బోదెను ఆక్రమించి గ్రావెల్‌తో నింపేశారని గ్రామస్తులు విలేకరులకు తెలిపారు. దీనివల్ల పూర్వం నుంచి ఉన్న పంట బోధి కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్ఐ రవితేజకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సుందరపల్లి సత్యనారాయణ, మందనక్క తణుకు రాజు, విప్పర్తి శ్రీనివాసరావు గోడి భాస్కర్ రావు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

## గృహ ప్రవేశాలకు సిఎం జగన్ రాక

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి సామర్లకోట పర్యటన ఖరారైంది. ఈ నెల 12వ తేదీన ఆయన సామర్లకోటకు వస్తున్నట్టు టూర్ షెడ్యూల్‌ను అధికారికంగా ఖరారు చేసినట్లు సోమవారం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు తెలిపారు.

ఈ నెల 12వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు హెలికాప్టర్లో పెద్దాపురం మున్సిపాలిటీ పరిధిలోని పెద్దాపురం రోడ్లోని 13వ వార్డులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు ముఖ్యమంత్రి జగన్ చేరుకుంటారు. అనంతరం అక్కడ 15 నిమిషాల పాటు ఆయన ప్రజలతో గడిపి వారి సమస్యలను వింటారు. అనంతరం ఇటిసి లేఔట్‌లోని జగనన్న కాలనీకి ప్రత్యేక బస్సులో చేరుకుంటారు. అక్కడ లబ్ధిదారులతో ముచ్చటిస్తారు. ఈ సందర్భంగా సామూహిక గృహప్రవేశాలను ఆయన చేపట్టి ఫోటో ప్రదర్శనను తిలకిస్తారు. కాలనీ వద్ద ఏర్పాటు చేసిన వైయస్ రాజశేఖర్ రెడ్డి కాంస్య విగ్రహాన్ని జగన్ ఆవిష్కరిస్తారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి చేరుకుంటారు. అనంతరం లబ్ధిదారులతో సిఎం ముఖాముఖి ఉంటుంది. అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశం తరువారం సిఎం జగన్ తిరిగి హెలికాప్టర్లో తాడేపల్లికి బయల్దేరి వెళతారు.



సిద్ధమైన సభా వేదిక

## నేటి యువతకు చేగువేరా ఆదర్శం

ప్రజాశక్తి-కాకినాడ

చేగువేరా వంటి విప్లవకారుని నేటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు చెప్పారు. ఎస్ఎఫ్ఐ నగర సెక్రెటరీ వాసుదేవ్ అధ్యక్షతన చేగువేరా 56వ వర్ధంతిని సంక్షేమ బాలుర హాస్టల్లో సోమవారం నిర్వహించరాఉ. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గంగా సూరిబాబు చేగువేరా చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సూరిబాబు మాట్లాడుతూ చేగువేరా హక్కుల సాధనకు నిరంతరం పోరాటం చేశారన్నారు. పేదరికంలో ఉన్న ప్రజలకు, విద్యార్థులకు ఉచిత విద్య, వైద్యం అందచేయాలని చేగువేరా యుక్త వయస్సులో నుంచే ఉద్యమ పటిమతో సమాజంలో జరుగుతున్న అణిచివేతను ఎండగట్టి, ప్రజలను చైతన్య పరిచారన్నారు. చేగువేరా మంచివైద్యుడు, రచయిత, మేధావి అని అర్జెంటీనాలో పుట్టి, క్యూబా విప్లవోద్యమంలో పాల్గొరన్నారని కొనియాడారు.



చేగువేరాకు నివాళులర్పిస్తున్న నాయకులు

## దోమల నిర్మూలనకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

సామర్లకోట మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రజలు పలు రకాల జ్వరాలతో బాధ పడుతున్నందున పట్టణంలో దోమల నివారణకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మానవ హక్కుల సంఘం నాయకులు మున్సిపల్ కమిషనర్ జె.రామారావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. నూతలపాటి అప్పలకొండ, ఎండి వలీ బాషా దోమల సమస్యపై విన్నవించారు. డ్రైన్లలో పూడికలు పేరుకుపోయి ఉండడంతో దోమల అభివద్ధి చెందుతున్నాయన్నారు. దామకాటుకు గురై అనేకమంది ప్రజలు డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా, విష జ్వరాల వంటి బలహీనతలకు గురై ప్రభుత్వాసుపత్రుల్లో, ప్రైవేట్ ఆస్పత్రిలోనూ చికిత్స పొందుతున్నారన్నారు. దోమల బాధితులు ప్రతి ఇంటా ఉన్నందున అధికారులు తక్షణమే స్పందించి వార్డుల్లో, మురికి కాలువల్లో దోమల నివారణకు మందులను పిచికారీ చేసి ప్రజారోగ్యాన్ని కాపాడాలని కమిషనర్‌కు విన్నవించారు. దానికి కమిషనర్ వివరణ ఇస్తూ దోమల సమస్యపై తక్షణమే స్పందించనున్నట్టు హామీ ఇచ్చారు.



వినతిపత్రం అందిస్నుత్న మానవహక్కుల సంఘం నాయకులు

## భూములను ఆన్‌లైన్ చేయాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా తమకు ఇచ్చిన భూములను ఆన్‌లైన్ చేయాలని దళిత ఆక్వా లబ్ధిదారులు మొర పెట్టుకున్నారు. ఈ సందర్భంగా తాళ్లరేవు తహశీల్దారు కార్యాలయం వద్ద లబ్ధిదారులు విలేకరులతో మాట్లాడారు. దళితుల లబ్ధిదారులు దిమ్మల జనార్ధన్, ద్రోణం సిద్ధార్థ కుమార్, యండమూరి సత్తిబాబు, ఈర్ల చిన్ననారాయణమూర్తి, పులిదిండి ప్రభావతి, మందపల్లి వెంకటస్వామి, యండమూరి బేతాళుడు తదితరులు విలేకరులతో మాట్లాడారు. ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా 1988లో 10 మందికి, 1996లో 10 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికీ ఎకరం చొప్పున చేపలు, రొయ్యలు పెంచుకోవడానికి చెరువులు కేటాయించారని తెలిపారు. వాటిని నేటికీ ఆన్‌లైన్ చేయలేదని తెలిపారు. వీరికి మద్దతుగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు నిలిచారు.



భూములను ఆన్లైన్ చేయాలని కోరుతున్న దళిత లబ్ధిదారులు



టాపర్స్‌తో ఉపాధ్యాయులు, సిబ్బంది

### సెల్ఫీ విత్ టాపర్స్‌తో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

విద్యార్థుల్లో పరీక్ష లంటే భయం పోగొట్టి ఆత్మ విశ్వాసం పెంపొందించడానికి ప్రభుత్వం సెల్ఫీ విత్ టాపర్స్‌కార్యక్రమం చేపట్టినట్టు ఆర్‌జెడి రాజు పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులతో ఆయన ఫోటో దిగారు. ఇటీవల జరిగిన ఎఫ్ఎ-2 పరీక్షల వాల్యుయేషన్ పరిశీలించారు. ఈ విధానంలో ప్రత్యేకతలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ పి.పుల్లయ్య, హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ, జి.గోవింద్, కెవివి.సత్యనారాయణ, ఎవివి.కుమారి, ఎ.శ్రీవల్లి పాల్గొన్నారు.

### నేడు దిశ జిల్లా కమిటీ సమావేశం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిల్లా అభివద్ధి సమన్వయం మరియు పర్యవేక్షణ కమిటీ (దిశా)సమావేశం మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని స్పందన సమావేశ మందిరంలో నిర్వహించడం జరుగుతోంది. ఈ కార్యక్రమంలో దిశా కమిటీ ఛైర్మన్, ఎంపి మార్గాని భరత్ రామ్, హోంమంత్రి డాక్టర్ తానేటి వనిత, జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. మాధవీలత, ఉమ్మడి గోదావరి జిల్లా పరిషత్ ఛైర్మన్లు, ఎంఎల్‌సిలు, ఎంఎల్ఎలు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొంటారు.

## యానాం వార్తలు



శిథిలమైన రెయిలింగ్

### శ్మశాన వాటికలో సదుపాయాల కరువు

ప్రజాశక్తి - యానాం

స్థానిక ట్రైడల్ లాకు దిగువనున్న హిందూ శ్మశానవాటికలో సదుపాయాలు లేకపోవడంతో అంత్యక్రియలకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భౌతికకాయాన్ని ఉంచి దహనం చేసే సిమెంట్ బెడ్ చుట్టూ ఉండే రెయిలింగ్ శిథిలమై అంత్యక్రియలకు ఆటంకం ఏర్పడుతుందని, దీనిపై ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా స్పందించడం లేదంటున్నారు. దీనికి తోడు శ్మశానవాటికకు వాచ్‌మెన్ లేకపోవడంతో గంజాయి బ్యాచ్ తమ అసాంఘిక కార్యకలాపాలకు ఉపయోగించుకుంటున్నారని చుట్టుపక్కల వాసులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు, స్మశానంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

రామచంద్రపురం : కె.గంగవరం మండలం కుందూరు గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమైందని ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన కుమార్తె సుంకర వీర వెంకటలక్ష్మి ఈ నెల 5న మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. నాటి నుంచి ఆమె తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులను వాకాబు చేసింది. ఎక్కడా ఆమె ఆచూకి తెలియకపోవడంతో ఆమె తల్లి ఎర్రంశెట్టి వెంకటరమణ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కె.గంగవరం ఎస్ఐ జానీ భాష కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### మానసిక విద్యార్థులకు ఆహారం పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని పులిమేరులోని శాంతివర్ధన మానసిక వికలాంగ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సోమవారం అన్నవరం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యురాలు నేతల వెంకటలక్ష్మి, మున్సిపల్ కౌన్సిలర్ నేతల హరిబాబు దంపతులు పండ్లు, ఆహారం, పాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఓమ్‌సాయి భార్గవి, కమల రాజ్, ప్రీతి, మౌనిక పాల్గొన్నారు.

### ఎస్‌కెఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్ మేళాను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. కంప్యూటర్ ఆపరేటర్స్, సూపర్వైజర్స్, అకౌంటెంట్ ఉద్యోగాల కొరకు జరిగిన జాబ్ మేళాలో విద్యా సంవత్సరంలో డిగ్రీ పొందిన 50కి పైగా విద్యార్థినులు పాల్గొన్నారు. టెక్నోటాక్స్, ముత్తూట్ ఫైనాన్స్, నవత ట్రాన్స్‌పోర్ట్, మోటోకార్ప్ కంపెనీలు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ బి.అనూరాధ, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ఎమ్.సునీత పాల్గొన్నారు.

### చంద్రకుమార్‌కు క్రియేటివ్ ఆర్టిస్ట్ అవార్డు

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

క్రియేటివ్ హార్ట్స్ అకాడెమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకొండి అంజి ఆధ్వర్యంలో నిర్వహించిన వందే వేద భారతం చిత్ర కళా పోటీల్లో పాలగుమ్మి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిత్రలేఖన ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్ వేసిన రాముడు, సీత, లక్ష్మణుడు, హనుమంతుడు చిత్రానికి క్రియేటివ్ ఆర్టిస్ట్ అవార్డ్‌ను అందుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 360 మంది చిత్రకారులు ఇందులో పాల్గొన్నారు. ఏలూరుకు చెందిన ప్రముఖ చిత్రకారులు ఎం.రాంబాబు, ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ ఎన్.మనువిహార్ తదితరుల చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు.

### మాజీ మంత్రి జక్కంపూడి నివాళి

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం నల్లవంతెన వద్ద జక్కంపూడి రామ్మోహన్‌రావు విగ్రహానికి వైసిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జక్కంపూడి వర్ధంతి సందర్భంగా పలువురు మాట్లడారు. ఆయన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు మద్దింశెట్టి ప్రసాద్, కల్వకోలను ఉమ, నవుండ్రు రమేష్, దాసం రాంబాబు, సుంకం స్వామి, రాజబాబు, సలాది గుప్తేశ్వరావు, మామిడిపల్లి రాము, కోటిపల్లి బాపన్న, జక్కంపూడి సత్యనారాయణ, కిరణ్, పెచ్చెటి నాని, కె.చిన్న పాల్గొన్నారు.

**మామిడికుదురు** : అప్పనపల్లిలో తులా గోపాలకష్ణ ఆధ్వర్యంలో సోమవారం మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు చిత్రపటానికి సర్పంచ్ గెడ్డం మహాలక్ష్మి, ఎంపిటిసి సభ్యులు బొంతు నీలిమ పూలమాలలు వేసి నివాళలర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పిచిక శివనాగసత్యనారాయణ, ఉపసర్పంచ్ మేడేపల్లి చిన్న, డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు, కంకిపాటి హిమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

### చిన్నారి వైద్యానికి 'అమ్మ' సాయం

ప్రజాశక్తి - మండపేట

చిన్నారి వైద్యం కోసం అమ్మ ఫౌండేషన్ రూ. 35 వేల ఆర్థిక సాయం అందించింది. రాజవొమ్మంగి మండలం చికిలింతకు చెందిన జర్రా రిషివర్ధన్ నిమజ్జన వేడుకల్లో గాయాల పాలవడంతో తల్లి దండ్రులు బాలుడిని కాపాడు కోవడానికి కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఇమిడిసెట్టి నాగభూషణం దాతలు సహకారంతో రూ.35 వేలను సేకరించి పట్టణ ఎస్ఐ చిన్నారావు చేతుల మీదుగా బాలుడు తల్లిదండ్రులకు అందజేశారు.

### అభివృద్ధి, సుస్థిర లక్ష్యాల ఏర్పాటుపై అవగాహన

ప్రజాశక్తి- కపిలేశ్వరపురం

గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి, సుస్థిర లక్ష్యాలు, శాఖల వారీ లక్ష్యాలు, ఏర్పాటుపై కపిలేశ్వరపురం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల స్థాయి సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎం.రామకృష్ణారెడ్డి, తహశీల్దార్ కె.సూర్యారావు ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. మండల ప్రత్యేక అధికారి ఎ.శాంతి, ఎస్ఐ బి.చంటి, తదితరులు హాజరయ్యారు.